

శ్రీకాళహస్తిలో నోరూరిస్తున్న వెరైటీ కేక్



తిరుపతి శిల్పారామంలో ఫ్యాషన్‌షో



తిరుమల ఆలయంలో పుష్పాలంకరణలు

# సంవత్సరాది సందడి



## పుష్పాలంకార శోభితం..శ్రీవారి ఆలయం


తిరుమల, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా శ్రీవారి ఆలయం పుష్పాలంకార శోభితమైంది.ఐదు టన్నుల సంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్‌తో ఆలయంలో వైకుంఠద్వారాన్ని, బంగారు వాకిలిని, బలిపీఠాన్ని, ధ్వజస్తంభాన్ని సౌందర్యవంతంగా అలంకరించారు. నెదర్లాండ్,తైవాన్,బ్యాంకాక్ దేశాలనుంచి తెప్పించిన తులిప్స్ కట్‌ఫ్లవర్స్‌ను, జెయింట్ అర్కిట్స్, ప్రోటీవర్ లాంటి అరుదైన పుష్పాలను అలంకరణలో వినియోగించారు.బెంగళూరుకు చెందిన సునీత పుష్పాలంకరణకు అవసరమైన విరాళం అందజేశారు. టీటీడీ గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దాదాపు 200మంది నిపుణులు ఈ అలంకరణ పనుల్లో పాల్గొన్నారు.

# ఇస్రో రామబాణం పీఎస్ఎల్వీ

### నేటి 60వ ప్రయోగానికి షార్‌లో సర్వం సిద్ధం

### ఉదయం 9.10గంటలకు నింగిలోకి దూసుకెళ్లనున్న పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్





షార్ ప్రయోగ వేదికపై పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ - ఎక్స్‌పో శాట్ ఉపగ్రహం

సూళ్లూరుపేట, డిసెంబరు 31:రాకెట్ ప్రయోగాల్లో తిరుగులేని శక్తిగా భారత్ ఎదగడంలో పీఎస్ఎల్వీ విజయాలదే పెద్దపీట.ఇస్రో గురితప్పని రామబాణంగా పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్(పీఎస్ఎల్వీ) పేరుగాంచింది.ఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీ వంటి చిన్న సౌండింగ్ రాకెట్ల ద్వారా చిన్న ఉపగ్రహాలనే పంపుతుండిన మన శాస్త్రవేత్తలు బరువైన ఉపగ్రహాలను పంపాలనే ఉద్దేశంతో ప్రయత్నాలు ప్రారంభించారు.1993లో పీఎస్ఎల్వీ ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. నాలుగు దశల్లో ఉన్న ఈ రాకెట్ బరువైన ఉపగ్రహాలను సులువుగా అంతరిక్షంలోకి మోసుకెళ్లుతోంది.ఈ రాకెట్ల ద్వారా విదేశీ ఉపగ్రహాలను కూడా అలవోకగా పంపే స్థాయికి ఇస్రో ఎదిగింది. ఇప్పటివరకూ 59 ప్రయోగాలు చేపట్టారు.వీటిలో మూడు ప్రయోగాలు మినహా అన్నీ విజయవంతమయ్యాయి.పైగా 47 ప్రయోగాల్లో ఇస్రో వరుసగా జైత్రయాత్ర సాగించింది. చంద్రయాన్-1, మార్స్ ఆర్బిటల్ మిషన్ వంటి కీలక ప్రయోగాలతో పాటు విదేశీ ఉపగ్రహాలను కూడా తీసుకెళ్లడం ద్వారా పీఎస్ఎల్వీ వాణిజ్యపరంగా కూడా భారత్‌కు పేరు తెచ్చిపెట్టింది. విదేశాలు చిన్న ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా పంపడానికి ఉత్సాహం చూపుతున్నాయి. ఇప్పటి వరకు 33 దేశాలకు చెందిన 319 ఉపగ్రహాలను ఇస్రో విజయవంతంగా ప్రయోగించి వాణిజ్యపరంగా మంచి లాభాలను ఆర్జించింది.సోమవారం షార్ నుంచి ప్రయోగించే పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ 60వ ప్రయోగం కావడం విశేషం.ఎక్స్‌పో శాట్ ఉపగ్రహాన్ని కూడా పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా పంపేందుకు ఇస్రో దీంతో శ్రీకారం చుట్టనుంది.ఈ నేపథ్యంలో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. భారీ భద్రత నడుమ సోమవారం ఉదయం 9.10గంటలకు ప్రయోగం జరగనుంది.షార్ చుట్టుపక్కల సీఐఎస్ఎఫ్ బలగాలతో పాటు సముద్ర మార్గాన కోస్టల్ గార్డులతో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## శక్తికాళి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

రామచంద్రాపురం, డిసెంబరు 31: రాయలచెరువుకట్టపై వున్న శక్తిపీఠంలో వెలసిన మరకతశక్తికాళీ అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. అలాగే ప్రత్యంగిరాదేవిని, వరాహి అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు కట్టారు.కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీస్వామితో పాటు శక్తిపీఠాధీశ్వరి రమ్యానంద భారతిని కలసి ఆశీర్వాదం స్వీకరించారు.

## అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, డిసెంబరు 31: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరురోడ్డులోని శిల్పారామంలో కళాతరంగిణి బృందం ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.



# చెరువులను కూడా వదిలిపెట్టరా..!




నిర్మాణాలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు - అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

- మాస్టర్ ప్లాన్ రోడ్లు వేసుకున్నది ఇందుకేనా?
- పాన చెరువు కబ్జాపై టీడీపీ మండిపాటు
- ఆక్రమణలు తొలగించిన రెవెన్యూ అధికారులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

**తిరుపతి-ఆంధ్రజ్యోతి :** వైసీపీ నేతల కబ్జా పర్వం రోజురోజుకూ హద్దుమీరిపోతోందని, చెరువులను కూడా వదిలిపెట్టడం లేదని టీడీపీ నేతలు మండిపడ్డారు. తిరుపతి అర్బన్ తిమ్మినాయుడుపాళెం రెవెన్యూ లెక్క దాఖలా కొత్తపల్లి గ్రామ సర్వే నెంబరు 80/2లో 2.93 ఎకరాల పాన (పాత) చెరువు కబ్జాకు గురైన నేపథ్యంలో 'పాన చెరువును చెరబట్టారు' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారుల్లో కదలిక వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది పాన చెరువు వద్దకు పరుగులు పెట్టారు. అక్రమంగా నిర్మిస్తున్న గోడలను తొలగించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నేతృత్వంలో ఆ పార్టీ నేతలు పాన చెరువుకు చేరుకుని అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరిట వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఆయన తనయుడి కనుసన్నల్లోనే భూ కబ్జాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చెరువు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని నిర్మాణాలు చేపడుతున్నారంటే అధికార పెద్దల హస్తం ఉండడం వల్లనే జరుగుతోందన్నారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణం ఒకవైపు, భూదందాలు మరోవైపు తిరుపతి నగరాన్ని భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. పాత చెరువును పరిరక్షించకపోతే టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, బిజి కృష్ణ యాదవ్, వెంకటరత్నం, నగర అధ్యక్ష, కార్యదర్శులు చినబాబు, మహేష్ యాదవ్, విశ్వనాథం, ప్రకాష్, డివిజన్ నాయకులు దోని, నరేష్, పూర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా తిరుపతి అర్బన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య మాట్లాడుతూ పాత చెరువు అన్యాక్రాంతంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలించి, అక్రమ నిర్మాణాలను తొలగించామన్నారు. మంగళవారం సర్వే చేసి చెరువు స్థలాన్ని కాపాడుతామన్నారు.

# అడ్డదారిలో టీటీడీ అగరబత్తీల అట్టపెట్టెలు



మందుల రవాణాలో అగరబత్తీల అట్టపెట్టెలు



అగరబత్తీల పార్శిల్‌కు వినియోగించే అట్టపెట్టెను మందులు, మాత్రల రవాణాకు వినియోగించుకొంటున్న తిరుపతికి చెందిన మెడికల్ ఏజెన్సీ

పలమనేరు, డిసెంబరు 31 : టీటీడీ విక్రయించే అగరబత్తీలను ప్యాకింగ్ చేసే అట్టపెట్టెలు అడ్డదారి పడుతున్నాయి. తిరుమలలోని లడ్డూ విక్రయ కేంద్రం వద్ద అగరబత్తీలను కూడా టీటీడీ భక్తులకు విక్రయిస్తోంది. అక్కడే కాకుండా టీటీడీ నడుపుతున్న దేవాలయాల వద్ద కూడా ఈ అగరబత్తీలను విక్రయిస్తుంటారు. అయితే ఈ అగరబత్తీలను ప్యాకింగ్‌కు వాడే అట్టపెట్టెలు అడ్డదారి పడుతున్నాయి.ఈ అట్టపెట్టెలపై టీటీడీ లోగో కూడా ముద్రించబడి ఉంటుంది. అయినా ఈ అట్టపెట్టెలను తిరుపతిలోని ఒక ప్రముఖ మందుల, మాత్రల ఏజెన్సీ వినియోగించుకొంటోంది. తిరుపతినుంచి పలమనేరుకు వస్తున్న మందులు, మాత్రలు ఈ అట్టపెట్టెల్లో వస్తున్నాయి. టీటీడీకి సంబంధించిన ఈ అట్టపెట్టెలు ప్రైవేటు ఏజన్సీలకు ఎవరు అందిస్తున్నారు, కేవలం అట్టపెట్టెలనేనా లేక అగరబత్తీలు కూడా అడ్డదారి పడుతున్నాయా టీటీడీ విజిలెన్స్ నిఘా వేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## జల్లికట్టు టీషర్టుల ఆవిష్కరణ




తిరుచానూరు, డిసెంబరు 31:చంద్రగిరి మండలం శానంబట్లలో జరిగే జల్లికట్టులో పాల్గొనే యువకుల కోసం టీ షర్టులను తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డి,కిషోర్, మోహన, రాజా తదితరులు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు.

## నేటి మహిళలు అందరికీ ఆదర్శం

తిరుచానూరు, డిసెంబరు 31: మహిళలు నేడు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని మేయర్ శిరీష అన్నారు. తిరుచానూరులో ఆదివారం జరిగిన నారీ శక్తి సమ్మేళనం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

## కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె



చంద్రగిరి, డిసెంబరు31: అంగన్వాడీ వర్కర్ల సమ్మె ఆదివారం 20వ రోజు కొనసాగింది. చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ముందు అంగన్వాడీ వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ స్వయంగా అంగన్వాడీ వర్కర్లకు జీతాల పెంపుపై హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని తెలిపారు. ఆయన ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శివ, కేవై రాజా, ప్రమీల, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ, పద్మిని, సుజాత, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## బ్లూమింగ్ బడ్స్ స్కూల్ వార్షికోత్సవం

చంద్రగిరి, డిసెంబరు 31: చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించారు. స్కూల్ ఛైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం



పాకాల, డిసెంబరు 31: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పాకాల యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో పాకాల యూనిట్ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్టీవో జ్ఞానప్రసూన మాట్లాడుతూ జనవరి 1వ తేది నుంచి జీవన్ ప్రమాణ్ ద్వారా విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.జయరామ నాయుడు, ప్రధాన కార్యదర్శి కృపావరమ్మ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. జీవన్ ప్రమాణ్ సమర్పించడానికి ఐరిష్ తీసే పరికరాన్ని పాకాల యూనిట్‌కు ఉచితంగా అందిస్తామని కృపావరమ్మ ప్రకటించారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. అనంతరం 35 మంది సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. దివంగత ఉపాధ్యాయుడు లీలావినోద్ కుటుంబ సభ్యులు అందరికీ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు కె.ఆర్.శంకర్, ఎం.కుప్పుస్వామినాయుడు, జి.ఆంజినేయులు, కె.రామమూర్తి, టి.సిద్దయ్య, డి.మునస్వామి, ఎన్.మునిరత్నంరెడ్డి, పి.భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి అభ్యర్థి మార్పుండదు : టీడీపీ

ఎర్రావారిపాలెం, డిసెంబరు 31 : చంద్రగిరి టీడీపీ టికెట్ బీసీలకు ఇవ్వనున్నట్లు పార్టీ క్యాడర్‌లో అయోమయం సృష్టించేందుకు కొంతమంది అసత్యప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్రసాధికార సమితి నాయకుడు వేణుగోపాల్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రగిరి టీడీపీ టికెట్ పులివర్తి నానీకే పార్టీ ఎప్పుడో నిర్ణయించిందన్నారు. పార్టీ క్యాడర్ ఎటువంటి అయోమయానికి గురి కావాల్సిన పనిలేదన్నారు.



## అమ్మవారి సేవలో లెఫ్టినెంట్ గవర్నర్

తిరుచానూరు, డిసెంబరు 31: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం జమ్ము కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదివారం దర్శించుకున్నారు.

# తిరుపతి

## తిరుమలలో కిషన్‌రెడ్డి, తమిళిసై



కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఈవో - తమిళిసైకి స్వాగతం పలుకుతున్న అధికారులు

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ గవర్నర్ తమిళిసై శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు వచ్చారు. రాత్రి తిరుమలలోని రచన అతిథిగృహానికి చేరుకున్న వారికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. వారు సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలసిన ఎస్ఎస్ ఉద్యోగులు



తిరుపతి (విద్య), డిసెంబరు 31 : కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి సమస్యలు విన్నవించారు. ప్రతిపక్షనేత హోదాలో సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని, సకాలంలో జీతాలు అందించాలని కోరారు. స్పందించిన మంత్రి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని 34 మండలాలకు చెందిన ఉద్యోగులు తిరుపతిలోని పాతమున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు.

## ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండరు ఆవిష్కరణ

తిరుపతి(విద్య), డిసెంబరు 31 : కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రూపొందించిన క్యాలెండరు, డైరీ, సీఎల్ బుక్, టేబుల్ క్యాలెండర్లను సంఘ నాయకులతో డీఈవో డాక్టర్ వి.శేఖర్ కలసి సోమవారం ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో మంచి ఫలితాలు సాధించేందుకు టీచర్లు కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై సంఘ నాయకులతో చర్చించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.నాగూరయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌కే బాబు, ఎస్.వెంకటముని, రాష్ట్ర నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు నరేంద్ర, ఏడీ-1 జీవీరమణ, ఏడీ-2లక్ష్మీనారాయణ, నాయకులు సురేష్, మునిరామిరెడ్డి, పీజీ కన్నప్ప, రవీంద్ర, ఈశ్వర్‌నాయుడు, విజయ్, వెంకటరత్నం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పౌరచైతన్య వేదిక ఆవిర్భావం



ప్రసాద్ - కుమార్ రెడ్డి


తిరుపతి(కల్చరల్) డిసెంబరు 31: సమాజంలో మానవ విలువలు, పౌర హక్కుల కోసం పోరాడుతూ, సామాన్యుల్లో, యువతలో రాజ్యాంగ విలువల గురించి అవగాహన కలిగించే ధ్యేయంతో ఆదివారం తిరుపతి జిల్లా పౌర చైతన్య వేదికను ఏర్పాటు చేశారు. సీనియర్ పాత్రికేయులు రాఘవశర్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేదిక గౌరవ సలహాదారుగా సాకం నాగరాజ, గౌరవాధ్యక్షుడిగా ఎ.రాఘవశర్మ, అధ్యక్షుడిగా వాకా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తమటం రామచంద్రారెడ్డి, ముషీర్ అహ్మద్, కార్యదర్శులుగా జి.ప్రతాప్ సింగ్, జ్ఞానప్రసూన, కోశాధికారిగా ఎ.హరీష్ ఎన్నికయ్యారు. మరో ఎనిమిది మందితో కార్యవర్గం రూపొందింది. మానవీయ సమాజం కోసం తమవంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది.



న్యూ ఇయర్ వేడుకల్లో యువతులు



రద్దీగా ఉన్న కేక్ షాపు



హోటల్‌లో డ్యాన్స్ చేస్తున్న నగరవాసులు



ఎంఆర్‌పల్లెలోని మద్యం దుకాణం వద్ద రద్దీ

# కోలాహలంగా 'కొత్త' సంబరాలు

తిరుపతి(కొర్లగుంట)/(కల్చరల్), డిసెంబరు 31 : నగరంలో 2024 నూతన సంవత్సర సంబరాలు కోలాహలంగా జరిగాయి. ఆలయాలు, చర్చిలు విద్యుత్ కాంతులతో మిరుమిట్లుగొలిపాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు డీజే సౌండ్స్, మ్యూజిక్ షోలు, డ్యాన్సులు, సింగింగ్, ఆటల పోటీలతో ప్రముఖ హోటల్స్ దద్దరిల్లాయి. ఆహార ప్రియులు నాన్‌వెజ్ ఫుడ్‌తో ఎంజాయ్ చేశారు. ప్రధాన కూడళ్లు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే ఫ్లెక్సీలు, ఆలయాలల్లో రంగురంగుల పుష్ప, పత్ర తోరణాలు ఆకర్షించాయి. వాణిజ్య సముదాయాలు, దుకాణాలన్నీ విద్యుద్దీపాలతో శోభాయమానంగా దర్శనమిచ్చాయి. వస్త్ర, స్వీట్స్, గిఫ్ట్ దుకాణాలు కళకళలాడాయి. రకరకాల బొకేలతో దుకాణాలు కనువిందు చేశాయి. యువతీయువకులు అర్ధరాత్రి వరకు ఆహ్లాదకర వాతావరణంలో గడిపి సరిగ్గా 12 గంటలకు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చుతూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రభుత్వ, టీటీడీ కార్యాలయాలు, బస్టాండు, రైల్వేస్టేషన్, విద్యా, వైద్యాలయాలు, పురవీధులు, శ్రీనివాససేతుపై విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. ఆకతాయిలు అల్లరి చేయకుండా పోలీసులు నిబంధనలు అమలు చేశారు.







పోలీసు ఆంక్షలతో మూతపడిన శ్రీనివాస సేతు - కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న యువత - తిరుమలలో భక్తుల కేరింతలు

# తిరుమలలో భక్తుల ఆందోళన

**దర్శనానికి అనుమతించాలంటూ రోడ్డుపై బైఠాయింపు**





రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న భక్తులు - ఆగ్రహిస్తున్న భక్తులకు నచ్చ చెప్తున్న విజిలెన్స్ సిబ్బంది

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో ఆదివారం కొంతమంది భక్తులు ఆందోళనకు దిగారు. తమను దర్శనానికి అనుమతించాలంటూ రోడ్డుపై బైఠాయించి టీటీడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైకుంఠద్వార దర్శనానికి సంబంధించి డిసెంబరు 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు స్లాటెడ్ సర్వదర్శనం, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి టికెట్లను ముందస్తుగానే భక్తులకు కేటాయించిన విషయం తెలిసిందే. టికెట్లు, టోకెన్ లేని భక్తులకు దర్శనం లేదని టీటీడీ గతంలోనే ప్రకటించింది. కాగా, ఈ సమాచారం తెలియకపోవడంతో కొంతమంది భక్తులు టికెట్లు లేకుండా ఆదివారం సాయంత్రం తిరుమలకు చేరుకుని వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు వెళ్లారు. అక్కడ విధుల్లోని సిబ్బంది అడ్డుకున్నారు. ఎంతకీ దర్శనానికి అనుమతించకపోవడంతో దాదాపు 30 మంది భక్తులు ఈవో కార్యాలయం ముందున్న సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. తమను దర్శనానికి అనుమతించాల్సిందేనంటూ పట్టుబట్టారు. కొంతమంది రోడ్డుపై బైఠాయించారు. పోలీసు, విజిలెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పి పంపారు. ఒకటో తేదీ వరకు టికెట్ల కేటాయింపు పూర్తయిందని, టోకెన్ రహిత దర్శనాలు 2వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. దీంతో భక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



# ఇదేంది స్వామీ..!

- వారధి కింద వెలసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్
- ఈట్ స్ట్రీట్ పేరిట ఏర్పాటు
- మాకు తెలియదంటున్న మున్సిపల్ అధికారులు

తిరుపతి-ఆంధ్రజ్యోతి : గరుడ వారధి (శ్రీనివాస సేతు) కింద హఠాత్తుగా తాత్కాలికమైన ఫాస్ట్‌ఫుడ్ సెంటరు వెలిసింది. దాని సమీపంలోని వారధి పిల్లర్‌కు నగరపాలక సంస్థ ఏర్పాటు చేసినట్టుగా అర్బన్ ఫుడ్‌ప్లాజా (ఈట్ స్ట్రీట్) పేరిట చిన్నస్టిక్కర్‌ను అంటించి ఉన్నారు. అయితే తమకు తెలియదని మున్సిపల్ అధికారులు అంటున్నారు. ఒకవేళ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పెట్టివుంటే వారధి కింద ఈట్ స్ట్రీట్ నడపాలన్న ఆలోచన ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. వారధి కింద పలు కూడళ్లలో ఆహ్లాదకరంగా నగరవాసులు కూర్చునేందుకు వీలుగా అందమైన గార్డనింగ్‌తో ఏర్పాటు చేయాలి. వారధి ప్రాజెక్టులో భాగంగా స్మార్ట్ స్ట్రీట్‌లో ఈ నిబంధన ఉంది. అయితే ప్రధానమైన మున్సిపల్ పార్కు ఎదురుగా ఉన్న వారధి సర్కిల్లో 'బిస్మిల్లా లైవ్ రోల్స్' పేరిట ఫ్రైడ్ చికెన్, బర్గర్స్ వంటివి అమ్మే వాటికి అనుమతి ఎవరిచ్చారన్నది తెలియాల్సి ఉంది. తిరుపతి ప్రజల కోసం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యాత్రికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలు కాకుండా తిరుపతి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఈట్‌స్ట్రీట్‌ను ఏర్పాటుచేయాలని నాలుగేళ్లుగా కసరత్తు చేస్తున్నారు. కపిలతీర్థం, ఎమ్మార్‌పల్లి వద్ద ఏర్పాటు చేయాలని తొలుత అనుకున్నారు. ఆ తర్వాత వెస్ట్ చర్చి సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన పెట్టాలని రోడ్డు నిర్మాణ పనులు కూడా జరిగాయి. రైల్వే అనుమతులు రాకపోవడంతో నిలిపివేశారు. చివరకు రేణిగుంట రోడ్డులో కొత్తగా వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డు (పరమాచార్య మార్గం)లో 30 నుంచి 40 చిన్న షాపులు తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు కౌన్సిల్లో కూడా తీర్మానం చేశారు. తీరా వారధి మధ్యలో ఇలా రాత్రికి రాత్రే అర్బన్ ఫుడ్ ప్లాజా పేరిట ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఏర్పాటైతే నగర సుందరీకరణ దెబ్బతినే అవకాశం ఉంది. రోడ్డు మధ్యలో ఏర్పాటుచేయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

## శ్మశాన వాటికకు స్థలం చూపండి



ఎస్సీ కమిషన్ సభ్యుడికి విన్నవిస్తున్న వెంకటరత్నం, టీఎన్‌పాళెం హరిజనవాడ వాసులు

తిరుపతి (రవాణా), డిసెంబరు 31 : ఎన్నో ఏళ్లుగా తమకు శ్మశాన వాటిక లేదని, ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు ఇబ్బంది అవుతోందని తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ వాసులు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సుభాష్ పార్థి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం తిరుపతికి వచ్చిన ఆయనను పద్మావతి అతిథిగృహం వద్ద కలిసి తమ సమస్యలు తెలియజేశారు. శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన ఆయన కలెక్టర్ వెంకటరమణారెడ్డితో చర్చించి 15 రోజుల్లో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు కాయం వెంకటరత్నం, సభ్యులు విజయ్, షణ్ముగం, మునెయ్య, గ్రామపెద్దలు నింద్ర ఏలుమలై, మద్దూరు అంకయ్య, అగరం చిరంజీవి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూముల్లో దౌర్జన్యాలు చేస్తున్నారు

- జేసీకి దళిత సంఘాల నాయకుల ఫిర్యాదు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 31 : దళితులకు సంబంధించిన భూముల్లో ప్రవేశించడమే కాకుండా దౌర్జన్యాలు చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు దళిత సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.శివరాజు మాట్లాడుతూ దళితుల భూములలో(ప్రభుత్వ) ఎర్రమట్టి, ఇసుక మాఫియాలు హల్‌చల్ చేస్తున్నాయని, జేసీబీలతో తోడేసి తరలించేస్తున్నాయని తెలిపారు. కిందిస్థాయి రెవెన్యూ అధికారులు, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. కబ్జాదారులు స్వర్ణముఖి నదిని, చెరువులను, కుంటలను, శ్మశాన వాటికలను, రహదారులను సైతం అమ్మేస్తున్నారని వివరించారు. వాటిని కాపాడాలని కోరారు. సమస్యలను పరిష్కరిస్తానని జేసీ వారికి హామీ ఇచ్చారు. అనంతరం జేసీని దళిత నాయకులు సి.మణి, బి.బాలరాజు, నారాయణస్వామి, నరేష్, మహేష్, రఘురాం, చంద్రశేఖర్, ప్రశాంత్, గిరి, గంగయ్య, రాజేశ్వమ్మ, నాగార్జున, సాయికుమార్, సుబ్రహ్మణ్యం, మహేష్, మురుగయ్య, గోవిందురాజు, జీవన్‌పాల్, ఆర్ముగం, వరప్రసాద్ కార్తీక్, వెంకటేశ్, గోపాల్ సన్మానించారు.

## వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేంద్ర మంత్రులు క్రిషన్ పాల్ గుర్జార్, నారాయణ్ రాణే, రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జయరాం, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, తెలంగాణ ఎమ్మెల్సీలు రఘోత్తం రెడ్డి, సుంకరి రాజు, బ్యాడ్మింటన్ ప్లేయర్ గోపీచంద్, ఏపీ క్రికెట్ అసోసియేషన్ మాజీ ఛైర్మన్ చాముండేశ్వరీనాథ్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు, టీటీడీ మాజీ జేఈవో శ్రీనివాసరాజు ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

# విహారంలో విషాదం

- చెరువులోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు చెన్నైవాసుల మృతి
- క్షేమంగా బయటపడ్డ ముగ్గురు



స్టీఫెన్ రాజు మృతదేహం



కెప్టెన్ ప్రభాకర్ మృతదేహం



చెరువు నుంచి కారును వెలుపలికి లాగుతున్న ఎక్స్‌కవేటర్

కేవీబీపురం, డిసెంబరు 31 : చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఎస్‌ఐ సునీల్ కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన కెప్టెన్ ప్రభాకర్(31), స్టీఫెన్ రాజు(31), కమల్‌రాజు (29), దినేష్(30), మారుతి(28) స్నేహితులు. వీరు విహారయాత్ర కోసమని తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం ఆరె గ్రామం వద్ద ఉన్న జలపాతానికి శనివారం సాయంత్రం వచ్చారు. రాత్రి అక్కడే బస చేశారు. ఆదివారం పగలంతా అక్కడే గడిపి సాయంత్రం 4గంటల సమయంలో కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి మిద్దికం డ్రిగ వద్ద ఉన్న పెద్ద చెరువులోకి దూసుకెళ్లి మునిగిపోయింది. స్థానికులు గుర్తించి వెంటనే కారు అద్దాలు పగులగొట్టి ముగ్గురిని కాపాడారు. అప్పటికే కెప్టెన్ ప్రభాకర్, స్టీఫెన్‌రాజు మృతిచెందారు. వారి మృతదేహాలను ఎస్‌ఐ సునీల్ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాణాలతో బయటపడిన వారిని కేవీబీపురం పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు.

### మద్యం మత్తే ప్రాణాలు తీసిందా?

కారు చెరువులో మునిగిన ఘటనలో ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురిలో కమల్‌రాజు చెన్నైలోని బిగ్ బజార్‌లో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. మారుతి, దినేష్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగాలు చేసుకుంటున్నారు.చనిపోయిన కెప్టెన్ ప్రభాకర్ వివాహితుడు కాగా స్టీఫెన్ రాజుకు వచ్చే నెలలో వివాహం జరగాల్సివుంది. అధికంగా మద్యం సేవించి నడపడం వల్లే కారు చెరువులోకి వెళ్లినట్టు భావిస్తున్నారు.



ప్రాణాలతో బయటపడ్డ కమల్‌రాజు, మారుతి, దినేష్

# బిర్యానీ తిన్నాడు.. రూ.7 లక్షల కారు గెలిచాడు



కారు గెలుచుకున్న రాహుల్

తిరుపతి(కొర్లగుంట), డిసెంబరు 31 : తిరుపతికి చెందిన రాహుల్ ఓ హోటల్లో బిర్యాని తిని రూ.7 లక్షల కారు గెలుచుసుకున్నాడు. ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని రోబో హోటల్ నిర్వహకులు నూతన సంవత్సరం సందర్భంగా లక్కీడిప్ నిర్వహించారు. తమ హోటల్లో బిర్యానీ తిన్నవారికి లక్కీ కూపన్లు అందజేశారు. డ్రాలో గెలుపొందిన వారికి నిస్సాన్ మాగ్నెట్ కారును బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. ఆ మేరకు 31వ తేదీ రాత్రి వరకు వచ్చిన 23 వేలకుపైగా కూపన్లతో లక్కీడ్రా నిర్వహించారు. ఇందులో తిరుపతికి చెందిన రాహుల్ కారును గెలుచుకున్నారు. హోటల్ అధినేత భరత్‌కుమార్‌రెడ్డి ఆయనకు కారు అందజేసి అభినందనలు తెలిపారు.

# కరాటేలో దీపిక ప్రతిభ

## జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన ఆర్టీసీ డ్రైవర్ కుమార్తె



తిరుపతి(కొర్లగుంట), డిసెంబరు 31 : జాతీయ స్థాయి కరాటే పోటీలలో నగరానికి చెందిన దీపిక ప్రతిభచాటి బంగారు పతకం కైవసం చేసుకుంది. సత్యవేడు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న పి.ఎం.గోపి కుమార్తె పి.దీపిక నగరంలోని టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ హైస్కూల్లో 6వ తరగతి చదువుతోంది. విద్యతో పాటు కరాటేలోనూ శిక్షణ తీసుకుంది. గతనెల 16న విశాఖపట్నంలో నిర్వహించిన కేలో ఇండియా ఉమెన్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్ అండర్-12 కరాటే పోటీలలో విజేతగా నిలిచింది. బంగారు పతకంతో పాటు సర్టిఫికెట్స్ స్వీకరించింది. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్‌యాదవ్ ఆదివారం ఆ బాలికను సన్మానించి, చిత్రపటాన్ని బహూకరించారు.





ఆలయం ముందు దర్శకుడు మారుతి

# సంక్రాంతికి ప్రభాస్ సినిమా ఫస్ట్‌లుక్

**- దర్శకుడు మారుతి**

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పాన్ ఇండియా హీరో రెబల్‌స్టార్ ప్రభాస్ నటిస్తున్న చిత్రం ఫస్ట్‌లుక్ సంక్రాంతికి విడుదల చేస్తామని ఆ చిత్ర దర్శకుడు మారుతి తెలిపారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం తమ చిత్రం షూటింగ్ జరుగుతోందని, అభిమానుల కోసం పండుగకు ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామని తెలిపారు. వైకుంఠ ఏకాదశికి స్వామిని దర్శించుకోలేకపోవడంతో ప్రస్తుతం వచ్చినట్టు చెప్పారు.



# నేడు ప్రముఖ ఆలయాలకు ఆర్టీసీ సర్వీసులు

తిరుపతి(కొర్లగుంట), డిసెంబరు 31 : ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని ప్రముఖ ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కాణిపాకం, శ్రీకాళహస్తి, తలకోన, గుడిమల్లం, నాగలాపురం, బుగ్గ అగ్రహారం, అప్పలాయగుంట వంటి ఆలయాలకు ఉదయం నుంచి 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సర్వీసులు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. పుత్తూరు బస్టాండు నుంచి నాగలాపురం, బుగ్గఅగ్రహారం, తిరుపతి సెంట్రల్ బస్టేషన్ నుంచి శ్రీకాళహస్తి, కాణిపాకం, గుడిమల్లం, అప్పలాయగుంటకు బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సాధారణ చార్జీలే వసూలు చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏటీఎం డి.రామచంద్ర నాయుడు కోరారు.

## హిందువుల మనోభావాలకు వ్యతిరేకంగా టీటీడీ నిర్ణయాలు : వీహెచ్‌పీ

తిరుపతి (తిలక్‌రోడ్), డిసెంబరు 31 : టీటీడీలో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయని విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, ప్రచారకర్త ప్రొఫెసర్ రమాదేవి విమర్శించారు. ప్రస్తుతం కలెక్టరేట్ నడుపుతున్న టీటీడీ భవనానికి అద్దె చెల్లించకపోగా అక్కడ పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ అయోధ్య శ్రీరామ పవిత్ర మంత్రాక్షతలు సోమవారం నుంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ శ్రీరాముడి ఆలయంలో అయోధ్య ఆలయ ప్రారంభ ఆహ్వాన పత్రికలు ఇస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు డాక్టర్ భరణి కృష్ణ, నాగరాజు శర్మ, నరసింహ, సుబ్బన్న పాల్గొన్నారు.

## శ్రీవారిపాదాల చెంత..

### పీఎస్‌ఎల్వీ సీ58 నమూనాకు ప్రత్యేక పూజలు



ఆలయం ముందు నమూనాతో ఇస్రో అధికారులు

తిరుమల, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పీఎస్‌ఎల్వీ సీ58 నమూనాకు తిరుమల శ్రీవారి పాదాల చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ప్రయోగానికి ముందు నమూనాను తిరుమలకు తీసుకువచ్చి శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించడం ఇస్రోకు ఆనవాయితీ. ఇందులో భాగంగా షార్ నుంచి సోమవారం ఉదయం 9.10 గంటలకు పీఎస్‌ఎల్వీ సీ58 నింగిలోకి ఎగరనున్న నేపథ్యంలో ఇస్రో డైరెక్టర్లు డాక్టర్ అమిత్‌కుమార్ పాత్ర, డాక్టర్ విక్టర్ జోసస్, ప్రిన్సిపల్ సెక్రటరీ యశోద, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌గుప్తా నమూనాతో ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వారు నమూనాను శ్రీవారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆదివారం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ దర్శించుకున్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో కలిసి ఆయన విచ్చేసి పీఎస్‌ఎల్వీ-సీ 58 రాకెట్ విజయవంతం కావాలని పూజలు చేశారు.

# అంగన్వాడీల ఆటాపాట



మంత్రుల ఫొటోలు ధరించి కబడ్డీ ఆడుతున్న అంగన్వాడీలు

తిరుపతి (రవాణా) డిసెంబరు 31 : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న అంగన్వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరుకుంది. తిరుపతిలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆటపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు మంత్రుల ఫొటోలను అంగన్వాడీలు ధరించి, కార్యకర్తలు ఓవైపు, మంత్రుల మాస్కులు ధరించిన వారు మరోవైపు ఉండి వినూత్న రీతిలో కబడ్డీ ఆడారు. అనంతరం గొబ్బియాలు వంటి ఆటపాటలతో నృత్యాలు చేశారు. 20 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 15వేలమందికి పైగా మహిళలను వీధులపాలు చేసిన ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి ఇది తగునా? అంటూ మండిపడ్డారు. తాము ఇక ఎన్నిరోజుల్లో నిరసన శిబిరాల్లో భోజనం చేయాలంటూ నాయుడుపేటలో అంగన్వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడూరులో గ్రామసేవకుల భవనం వద్ద, వెంకటగిరి, కోటలో ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద అంగన్వాడీల ఆధ్వర్యంలో రిలే దీక్షలు నిర్వహించారు. కోలాటం, నృత్యాలు ఆడి నిరసన తెలిపారు. పుత్తూరులో కబడ్డీ ఆడుతూ అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. అలాగే చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, పిచ్చాటూరులో ఆటపాటలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేలా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని డిమాండు చేశారు. లేకుంటే బటన్ నొక్కే సమయం దగ్గరపడిందని హెచ్చరించారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు

తిరుమల, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.70 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 63,728 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 19,206 మంది తలనీలాలు సమర్పించారు.

## తిరుమలలో ఐదు లడ్డూ కౌంటర్లకు ఎస్‌బీఐ స్పాన్సర్‌షిప్



తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని లడ్డూ కౌంటర్ల కాంప్లెక్స్‌లో ఉన్న ఐదు కౌంటర్లకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్‌షిప్ అందించింది. వీటిని ఆదివారం ఉదయం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, బ్యాంక్ ఎండీ శ్రీనివాసశెట్టి పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## కొత్త సంవత్సరం సంతోషాలు తేవాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 31 : 2024 కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో సంతోషాలు తేవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆకాంక్షించారు. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, మద్దెల గురుమూర్తి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి రోల్‌బాల్ స్కూల్ గేమ్స్



అండర్ 14 బాలుర జట్టు

తిరుపతి (కొర్లగుంట), డిసెంబరు 31 : శ్రీనివాస క్రీడా సముదాయ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి రోల్‌బాల్ స్కూల్ గేమ్స్ ఆదివారం ముగిశాయి. జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ విజయకుమారి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో విజేతలకు కప్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా రోల్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.ప్రతాప్, జాయింట్ సెక్రటరీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విజేతల వివరాలు..**

- అండర్-17 బాలుర విభాగంలో విశాఖపట్నం (ప్రథమ), ఉమ్మడి చిత్తూరు జిల్లా (ద్వితీయ), గుంటూరు జిల్లా (తృతీయ).
- అండర్-14 బాలుర విభాగంలో కృష్ణా జిల్లా(ప్రథమ), అనంతపురం (ద్వితీయ), ఉమ్మడి చిత్తూరు జిల్లా(తృతీయ).



అండర్ 14 బాలికల జట్టు

- అండర్-17, 14బాలికల విభాగాలలో కృష్ణా (ప్రథమ), ఉమ్మడి చిత్తూరు (ద్వితీయ), గుంటూరు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.



## తిరుమలలో ఐదు లడ్డూ కౌంటర్లకు ఎస్‌బీఐ స్పాన్సర్‌షిప్

తిరుమల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని లడ్డూ కౌంటర్ల కాంప్లెక్స్‌లో ఉన్న ఐదు కౌంటర్లకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్‌షిప్ అందించింది. వీటిని ఆదివారం ఉదయం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, బ్యాంక్ ఎండీ శ్రీనివాసశెట్టి పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి



గేటు పుత్తూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 31: టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య అన్నారు. ఆదివారం గేటు పుత్తూరులోని బూత్ నెంబర్ 57లో 10వ వార్డు ఇన్‌చార్జి డీజీ ధనపాల్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మహేష్ మెరుపుల, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, నాయకులు ప్రసాద్‌నాయుడు, శ్రీనివాసులు, రూపేంద్ర, సుజాత, గోపీఆచారి, మోహన, కరుణాయాదవ్, సోము, హమీద్, రఫీ, అన్బు, ఈశ్వరయాదవ్, మోహన్‌రాయల్, గణపతి, వేల్‌రెడ్డి, జగదీష్, జనసేన నాయకుడు కటికం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ చాంబర్ సదస్సుకు తరలిరండి

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 31: స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన వైసీపీ పాలన దమనకాండపై ఈనెల 3వ తేదీ మంగళగిరిలోని డీజీపీ ఆఫీసు పక్కన ఉన్న సీకే కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న పంచాయతీరాజ్ చాంబర్ సదస్సుకు తరలిరావాలని తడుకు సర్పంచు, టీడీపీ నాయకుడు బొబ్బిలియాదవ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.





## వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



డిస్ట్రిక్ గవర్నర్ మాధవనాయుడిని సన్మానిస్తున్న సభ్యులు

పుత్తూరు, డిసెంబరు 31: పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం అసోసియేషన్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఇంటర్ నేషనల్ వాకర్స్ అసోసియేషన్ 302 డిస్ట్రిక్ గవర్నర్‌గా ఎంపికైన మాధవనాయుడు మాట్లాడుతూ పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ నుంచి ఇంటర్ నేషనల్ కమిటీ ఇప్పటి వరకు ముగ్గురు సభ్యులను గవర్నర్ పదవులకు ఎంపిక చేయడం గర్వకారణమన్నారు. సమావేశానికి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించారు. కొత్త కార్యవర్గ సభ్యులను, డిస్ట్రిక్ గవర్నర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ అధ్యక్షుడు కేఎల్ మూర్తి, ఇంటర్‌నేషనల్ వాకర్స్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ రవిరాజు, కార్యదర్శి మునికృష్ణయ్య, కోశాధికారి గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







### కబడ్డీ ఆడి అంగన్వాడీల నిరసన

పుత్తూరు టౌన్, డిసెంబర్ 31: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలు ఆదివారం కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. సీఐటీయూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత అంగన్వాడీల సమ్మె వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, హేమలత, నాయకులు మునికుమారి, విజయ్‌కుమారి, ధనమ్మ, హైమావతి, రాధా, లలిత, గంగులమ్మ, అరుణ, మోహన్ లక్ష్మి, అన్నపూర్ణ, పద్మజ తదితరులు పాల్గొన్నారు

### క్యాలెండర్ల ఆవిష్కరణ

పుత్తూరు, డిసెంబరు 31: వైద్య ఆరోగ్యశాఖ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవిరాజు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివయ్య, జిల్లా అధ్యక్షుడు నరసింహప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి రమేష్‌బాబు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు ఆర్టీసీ డిపో వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ క్యాలెండర్‌ను వైసీపీ నాయకుడు రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, శ్రీరాములు, గ్యారేజ్ కార్యదర్శి మురుగేష్, నాయకులు చంద్రన్, శ్రీరాములు పాల్గొన్నారు.

## 300 ఎకరాల భూకబ్జా...!


పాపానపల్లె వద్ద భూములు చదును చేస్తున్న యంత్రాలు

శ్రీకాళహస్తి డిసెంబరు 31: శ్రీకాళహస్తి మండలంలో 300 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు ఆదివారం కలకలం రేగింది. మండలంలోని పాపనపల్లి వద్ద విస్తారమైన ప్రభుత్వ భూమి ఉంది. కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో చదును చేసే పనులు చేపట్టారు. కొందరు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా అటువైపు అధికారులు ఎవరూ కన్నెత్తి చూడలేదు. దీంతో పెద్దఎత్తున 300 ఎకరాల భూమి కబ్జా జరుగుతోందంటూ స్థానికులు సామాజిక మాధ్యమాలలో పోస్టు చేయడంతో అది వైరల్‌గా మారింది.

## జనసేనలో వైసీపీ నాయకుల చేరిక



వరదయ్యపాళెం, డిసెంబరు 31: బుచ్చినాయుడుకండ్రిగ మండంలోని పలు వురు వైసీపీ నాయకులు జనసేన పార్టీలో ఆదివారం చేరారు. వారికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లావణ్యకుమార్, జిల్లా కార్యదర్శి దాసు హేమ కుమార్, కాపు సంక్షేమ యువసేన అధ్యక్షులు మోహన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లావణ్యకుమార్ వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమన్నారు. జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొగ్గల కృష్ణ, బాలాజీ, చెంగయ్య, జీవన, సురేష్, విక్రమ్, హేమభూషణం, అశోక్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధే జీవిత ఆశయం



మాట్లాడుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 31: తన తండ్రి మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి తరహాలో శ్రీకాళహస్తిని అభివృద్ధి చేయడమే జీవిత ఆశయం అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళ హస్తిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదనరెడ్డి తన అవినీతి సొమ్మును ఓటుకు రూ.10వేలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. అయితే నిజాయి తీగా పనిచేసే తనకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఊరందూరు సమీపంలో జగనన్న కాలనీ నిర్మాణం కోసం సేకరించిన భూమికి ఎకరా ధర రూ17.5 లక్షలు నిర్ణయించి భూ యజమానులకు రూ.6లక్షలు ఇచ్చి మిగతా సొమ్ము ఎమ్మెల్యే కాజేశారని ఆరోపించారు. అధికార పార్టీ నేతల అక్రమాల కారణంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ఇసుక కరువైందన్నారు.ఈ సమస్యపై కలెక్టరు, ఆర్డీవో, తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. శ్రీకాళ హస్తిలో చాలామంది పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే శ్రీకాళ హస్తిలో వైసీపీ నాయకులు అక్రమంగా ఆక్రమిం చుకున్న ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు వైసీపీ నాయకుల వద్ద భూములు ఎవరూ కొనుగోలు చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమా వేశంలో టీడీపీ నేతలు రవి, రాంబాబు నాయుడు, ప్రతాప్ రెడ్డి, అస్మత్, శ్రీనివాసులురెడ్డి, పాండు, ఢిల్లీ బాబు, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిప్రదక్షిణ మార్గంలో కబ్జా

శ్రీకాళహస్తి డిసెంబరు 31: కైలాసగిరి ప్రదక్షిణ మార్గంలో ఆదివారం భూకబ్జా వెలుగు చూసింది. ఇటీవల కైలాసగిరిలో చుట్టూ ముక్కంటి ఆలయ నిధులతో దేవుని బాట సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే అప్పటినుంచి కొండకు అనుకొని ఉన్న భూములపై అక్రమార్కులు కన్నేశారు. తొట్టంబేడు మండలానికి చెందిన అధికార పార్టీ నేత రాత్రికి రాత్రి దేవుని బాటలో కొంత భూమిని చదును చేసినట్లు సమాచారం. అధికారులు కబ్జాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


దేవుని బాటలో చదును చేసిన భూమి

## పింఛను ఇప్పించండి సారూ..



తల్లితో చెల్లయ్య

వరదయ్యపాళెం, డిసెం బరు 31: దివ్యాంగుడైన తనకు పింఛను ఇప్పించాలని సీఎల్ఎన్ పల్లి ఎస్టీకాలనీకి చెందిన చెల్లయ్య కోరుతున్నాడు. పుట్టుకతోనే హార్మోన్ల లోపం కారణంగా శారీరక ఎదుగుదల లేదు. దీంతో అతను మూడు అడుగులు మాత్రమే ఉంటాడు. నిరుపేద కుటుంబానికి చెళ్లయ్యకు పూట గడవడమే కష్టం. పింఛను కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు మంజూరు కాలేదు. కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా అధికారులు ఇదిగో అదిగో అంటున్నారే తప్ప పింఛను ఇప్పించడం లేదు. ఇతని అవిటితనం వలన ఎవరూ పనిలో పెట్టుకోవడం లేదు. దీంతో తల్లిని పోషించు కోలేక ఇబ్బంది పడుతున్నాడు. అంతేగాక ఇటీవల కురిసిన వర్షానికి వారి గుడిసె కూడా దెబ్బతింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పింఛను ఇప్పించాలని చెళ్లయ్య వేడుకుంటున్నాడు.

## టీడీపీ విజయానికి కృషిచేయండి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఏర్పేడు, డిసెంబరు 31: టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు నరసింహులుయాదవ్ పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం సీతారాంపేట గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఉచితంగా ట్రాక్టర్లు, సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు, ఎరువులు అందించామన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతులను గాలికొదిలేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు యాదవ్, రమణయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసరాల వితరణ



శ్రీకాళహస్తి డిసెంబరు 31: శ్రీకాళహస్తి మండలం యల్లంపల్లి ఎస్టీ కాలనీకి చెందిన చెంచుకృష్ణమ్మ కుటుంబానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. ఇటీవల చెంచుకృష్ణమ్మ మృతిచెందిన క్రమంలో ఆదివారం ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వారి కుటుంబాన్ని పరామర్శించారు. సుమారు 40 రకాల నిత్యావసర సరుకులను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండరు ఆవిష్కరణ



వరదయ్యపాళెం, డిసెంబరు 31: తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి కార్యాలయంలో ఆదివారం వరదయ్యపాళెంకు చెందిన శ్రీకాళహస్తీశ్వ రాలయ పాలకమండలి సభ్యుడు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి నూతన సంవత్సరం క్యాలెండరు ఆవిష్కరింపజేశారు. అనంతరం ఆయనకు ముక్కంటి ప్రసాదాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## దేవాంగ సంఘం క్యాలెండరు ఆవిష్కరణ



వరదయ్యపాళెం, డిసెంబరు31: వరదయ్యపాళెంలోని బజారు వీధిలోని దేవాంగ సంఘ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం నూతన క్యాలెండరును ఆవిష్కరించారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సంఘం నాయ కులు బొప్పన చెంగల్ రాయులు, రఘురామ్, పృథ్వీ రవి, నిర్మల్ కుమార్, చంద్రబాబు, కనక శేనుడు, మునస్వామి, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆప్‌తోనే అవినీతి రహిత పాలన



కరపత్రాలు పంచుతున్న ఆప్ నాయకులు

వరదయ్యపాళెం, డిసెంబరు 31: ఆమ్ ఆద్మీ పార్టీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచలపతి అన్నారు. ఆదివారం వరదయ్య పాళెంలో పర్యటించారు. ప్రజలను అడిగి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆప్ అధికారంలో వస్తే పేదల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొప్పన శ్రీనివాస్, వెంకటేష్, నందిని, నందింటి శ్రీనివాసులరెడ్డి, సూర్య పాల్గొన్నారు.

## జగన్ రెడ్డిని సాగనంపాలి



ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి డిసెంబరు 31: వచ్చే ఎన్నికల్లో జగన్ రెడ్డిని సాగనంపి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉమేష్‌రావు పిలుపునిచ్చారు. పట్టణంలో 22వ వార్డులో ఆదివారం భవిష్యత్తుకు గ్యారెంటీపై ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుజ్జి, మునిరాజ పాల్గొన్నారు.

# విహారంలో విషాదం

- చెరువులోకి దూసుకెళ్లిన కారు
- ఇద్దరు చెన్నైవాసుల మృతి
- క్షేమంగా బయటపడ్డ ముగ్గురు



చెరువు నుంచి కారును వెలిపలికి లాగతున్న ఎక్స్‌కవేటర్

స్టీపెన్ రాజు మృతదేహం



కెప్టెన్ ప్రభాకర్ మృతదేహం

కేవీబీపురం, డిసెంబరు 31 : చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఎస్ఐ సునీల్ కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన కెప్టెన్ ప్రభాకర్(31), స్టీఫెన్ రాజు(31), కమల్‌రాజు (29), దినేష్(30), మారుతి(28) స్నేహితులు. వీరు విహారయాత్ర కోసమని తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం ఆరె గ్రామం వద్ద ఉన్న జలపాతా నికి శని వారం సాయంత్రం వచ్చారు. రాత్రి అక్కడే బస చేశారు. ఆదివారం పగలంతా అక్కడే గడిపి సాయంత్రం 4గంటల సమయంలో కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి మిద్దికండ్రిగ వద్ద ఉన్న పెద్ద చె రువులోకి దూసుకెళ్లి మునిగి పో యింది. స్థానికులు గుర్తించి వెంటనే కారు అద్దాలు పగులగొట్టి ముగ్గురిని కాపాడారు. అప్పటికే కెప్టెన్ ప్రభాకర్, స్టీఫెన్‌రాజు మృతి చెందారు. వారి మృతదేహాలను ఎస్ఐ సునీల్ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాణాలతో బయటపడిన వారిని కేవీబీపురం పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు.

### మద్యం మత్తే ప్రాణాలు తీసిందా?

కారు చెరువులో మునిగిన ఘటనలో ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురిలో కమల్‌రాజు చెన్నైలోని బిగ్ బజార్‌లో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. మారుతి, దినేష్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగాలు చేసుకుంటున్నారు.చనిపోయిన కెప్టెన్ ప్రభాకర్ వివాహితుడు కాగా స్టీఫెన్ రాజుకు వచ్చే నెలలో వివాహం జరగాల్సి వుంది. అధికంగా మద్యం సేవించి నడపడం వల్లే కారు చెరువులోకి వెళ్లినట్టు భావిస్తున్నారు.



ప్రాణాలతో బయటపడ్డ కమల్‌రాజు, మారుతి, దినేష్

# ఊరందూరుపై అసత్య ప్రచారం తగదు



మీడియాతో మాట్లాడుతున్న ఊరందూరు గ్రామ పెద్దలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 31: ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఊరందూరుపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని గ్రామపెద్దలు హితవు పలికారు. టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సొంత గ్రామానికి సైతం ఏమీ చేయలేదని వైసీపీ వారు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడంపై వారు స్పందించారు. ఊరందూరు గ్రామంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ఊరందూరు చెరువు తెగిపోతుండగా ఎమ్మెల్యే స్పందించి గ్రామాన్ని కాపాడినట్లు ప్రచారం చేసుకోవడం భావ్యం కాదన్నారు. నాలుగున్నర సంవత్సరాల నుంచి ఏ రోజూ వైసీపీ నేతలు ఊరందూరు చెరువు కట్టపై కాలు పెట్టిన దాఖలాలు లేవన్నారు. ఇటీవల ప్రమాదపు అంచులో ఉన్న తమ చెరువుకు గ్రామస్తులంతా కలిసి ఎక్స్‌కవేటర్‌తో గండి కొట్టామని వివరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే కుమారుడు రోడ్డు నిర్మాణ సంస్థకు చెందిన హిటాచి యంత్రంతో వచ్చి నాలుగు ఫొటోలు తీసుకుని గ్రామాన్ని కాపాడి నట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా తమ గ్రామంలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. అయితే ప్రభుత్వం నుంచి గ్రామానికి ఒక్క రూపాయి కూడా రాలేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైతులు నీలకంఠారెడ్డి సుబ్బరాయుడు, తిరుపాల్ దయాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పెరుమాల్, రాంబత్తయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కేకుల వితరణ



శ్రీకాళహస్తి డిసెంబరు 31: నూతన సంవత్సరం పురస్కరించుకుని టీడీపీ నాయకులు డాక్టరు రాజేష్‌నాయుడు కేకులను వితరణ చేశారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఎస్టీ కాలనీ, తొట్టంబేడు మండలం ఇనగలూరు ఎస్టీ వాసులకు ఆదివారం ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్ గురవయ్యనాయుడి తనయుడు రాజేష్ నాయుడు కేకులను అందజేశారు.

## ప్రజారోగ్యమే బీజేపీ లక్ష్యం



పేదలకు మందులు పంపిణీ చేస్తున్న కోలా ఆనంద్

రేణిగుంట, డిసెంబరు31: దేశంలో పేదలను సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషిచేస్తోందని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి కోలా ఆనంద్ అన్నారు. ఆదివారం గాజులమండ్యం, కొత్రమంగళం పంచాయితీల్లో వికసిత్ భారత్ సంకల్ప బస్సు యాత్ర నిర్వహించారు. అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. సుబ్రమణ్యంరెడ్డి, కె.గోపాల్, ధర్మారెడ్డి, బొబ్బిలిరెడ్డి, నాగరాజు, ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ ఎం.వెంకటరత్నమ్మ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటలు పాటలతో అంగన్వాడీల ఆందోళన



సత్యవేడులో గొబ్బెమ్మ పాటలతో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

సత్యవేడు, డిసెంబరు 31: అంగన్వాడీల సమ్మె ఆదివారంతో 20 రోజుకు చేరింది. ఇందులో భాగంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఆటపాటలతో ఆందోళన చేపట్టారు. గొబ్బి పాటలను సీఎం జగన్‌పై పేరడీ పాటలు పాడి నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీల నాయకులు నిర్మల, శాంతి, సుభాషిణి, ఝాన్సీ, సుభాషిణి, భారతి, పార్వతి, కాంతమ్మ, దివ్య, గౌరి, భువన తదితరులు పాల్గొన్నారు.

**పిచ్చాటూరు:** అంగన్వాడీల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడం ఖాయమని అంగన్వాడీ మండల యూనియన్ అధ్యక్షురాలు ఇందిర హెచ్చరించారు. పిచ్చాటూరులో గొబ్బి పాటలు పాడి నిరసన తెలియజేశారు.

## చంద్రబాబుతోనే బంగారు భవిష్యత్తు

శ్రీకాళహస్తి డిసెంబరు 31: చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తును పొందగలమని టీడీపీ నాయకురాలు బొజ్జల రిషితారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి లోని 16వ వార్డులో ఆమె ఆదివారం టీడీపీ మ్యానిఫెస్టోపై ఇంటింటా ప్రచారం చేశారు.

## 25 మద్యం సీసాల స్వాధీనం

ఏర్పేడు, డిసెంబరు 31: ఏర్పేడు మండలం సరస్వతికండ్రిగ గ్రామంలో మద్యం అమ్ముతున్న దుకాణంపై ఏర్పేడు పోలీసులు ఆదివారం దాడిచేశారు. మద్యం అమ్ముతున్న వ్యక్తి నుంచి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## వైసీపీ పీడను వదిలించుకోవాలి: జనసేన



దుస్తులు ఇస్త్రీ చేస్తున్న వినుత

శ్రీకాళహస్తి డిసెంబరు 31: వైసీపీ పీడను వచ్చే ఎన్నికల్లో వదిలించుకోవాలని శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇంచార్జి వినుత పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమాపురం పంచాయతీలో టీడీపీ-జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో పై ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు దండి రాఘవయ్య, ఐటీ కో-ఆర్డినేటర్ శివకుమార్, ఏర్పేడు మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు గణేష్, రవికుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, కవిత, శారద, తదితరులు పాల్గొన్నారు.

## 14 మంది జూదరుల అరెస్ట్

తొట్టంబేడు, డిసెంబర్ 31: కోడిపందేలు ఆడుతున్న 14మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు తొట్టంబేడు పోలీసులు తెలిపారు. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. మండలంలోని కాసరం చెరువు వద్ద కొందరు కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందింది. ఎస్ఐ తన సిబ్బందితో కలిసి కోడిపందెం స్థావరంపై దాడులు నిర్వహిం చారు. కోడి పందేలు ఆడుతున్న 14మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4కోళ్లు, రూ.3050నగదును స్వాధీనం చేసుకున్నారు.

## ముక్కంటి సేవలో ఇస్రో శాస్త్రవేత్తలు



శ్రీకాళహస్తి డిసెంబరు 31: శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఆదివారం ఇస్రో శాస్త్రవేత్తలు దర్శించుకున్నారు. శ్రీహరికోటలోని ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ లాంచింగ్ చేసే ముందు ముక్కంటి ఆలయాన్ని దర్శించుకోవడం సెంటిమెంట్‌గా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాకెట్ ప్రయోగం ఉండడంతో ఆదివారం పలువురు సైంటిస్టులు ముక్కంటి దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జున ప్రసాద్ వీరికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏరాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా అనంతపురం కలెక్టర్ గౌతమి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

## గోదానం మహా పుణ్యం

శ్రీకాళహస్తి, డిసెంబరు 31: గోదానం మహా పుణ్యప్రదం అని ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా మేటపల్లికి చెందిన సుబ్రమణ్యం కుటుంబ సమేతంగా ఆదివారం ముక్కంటి ఆలయానికి విచ్చేశారు. ఆవు, దూడతో పాటు గోసంరక్షణకు రూ.10 వేల నగదును విరాళంగా ఇచ్చారు. ఆలయంలోని సప్త గోకులంలో చైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చందు శర్మ తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో నీటి సమస్య పరిష్కరించండి

రేణిగుంట, డిసెంబరు31: రేణిగుంటలో తాగునీటి సమస్య పరిష్కరించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబుబ్‌బాష కోరారు. కనీసం పండుగ రోజుల్లోనైనా సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు.

## ముక్కంటి ఆలయంలో బాలికకు అస్వస్థత


చికిత్స పొందుతున్న పూర్ణి

శ్రీకాళహస్తి డిసెంబరు 31: ముక్కంటి ఆలయంలోని క్యూ లైన్‌లో పూర్ణి అనే బాలికకు ఊపిరాడక అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రానికి చెందిన భక్తులు ఆదివారం ముక్కంటి ఆలయంలో రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం దర్శనానికి వెళ్లారు. అమ్మవారి సన్నిధిలో క్యూలైన్‌లో వెళుతుండగా పూర్ణి అస్వస్థతకు గురైంది. ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిబాబు యాదవ్ బాలికను చికిత్స నిమిత్తం హోటల్ శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవల అనంతరం బాలిక కోలుకుంది.

## షాపింగ్ కాంప్లెక్సు ప్రారంభం



ఏర్పేడు, డిసెంబరు 31: ఏర్పేడు మండల కేంద్రంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య ఆధ్వర్యంలో రూ.కోటితో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సు గదులను ఆదివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరమాల చంద్రశేఖర్, నాగార్జునరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, జనార్ధన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అటెండర్ దుర్మరణం


పురుషోత్తం మృతదేహం

శ్రీకాళహస్తి, డిసెంబరు 31: గురుకుల పాఠశాలలో అటెండర్‌గా పనిచేసే పురుషోత్తం (45) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. నారాయణవనం మండలం లక్ష్మీపురం ఎస్టీ కాలనీకి చెందిన పురుషోత్తం రేణిగుంటలోని గురుకుల పాఠశాలలో అటెండర్‌గా పనిచేసేవారు. గతంలో శ్రీకాళహస్తిలో పనిచేశారు. ఈ క్రమంలో ఆదివారం సొంతపనిపై ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి వచ్చాడు. సాయంత్రం తిరిగి ఇంటికి బయలుదేరాడు. తొండమనాడు వద్ద గుర్తుతెలియని వాహనం అయన వాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో పురుషోత్తం అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిచ్చికుక్క స్వైరవిహారం

● ముగ్గురు వ్యక్తులకు, మూడు ఆవులకు గాయాలు





బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 31: బుచ్చినాయుడు కండ్రిగలో ఆదివారం సాయంత్రం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలోని రాజశేఖర్, సుధాకర్, వసంతరావును కరిచింది. వారు గాయపడ్డారు. అలాగే మూడు ఆవులపై దాడిచేసి గాయపరిచింది. గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజులు పారిశుధ్య కార్మికులతో కలిసి పిచ్చికుక్కను బంధించారు. తర్వాత అడవిలో వదిలేశారు.

## తప్పిపోయిన పిల్లల అప్పగింత



శ్రీకాళహస్తి డిసెంబరు 31: తప్పిపోయిన పిల్లలను పోలీసులు తిరిగి తండ్రికి అప్పగించారు. ఒంగోలుకు చెందిన శీను డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈయన భార్య మరణించింది. ఇద్దరు పిల్లలతో పాటు తిరుమలకు వచ్చాడు. గ్రామానికి తిరిగి బస్సులో బయలుదేరారు. మార్గమధ్యంలోని శ్రీకాళహస్తిలో శ్రీను బహిర్భూమి కోసం బస్సు దిగారు. ఆ తర్వాత మరిచి వేరే బస్సులో ఊరికి వెళ్లిపోయాడు. దీంతో పిల్లలు ఏడుస్తూ ఉండటంతో స్థానికులు రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ మల్లికార్జున బస్టాండుకు చేరుకుని పిల్లలను చేరదీశారు. పిల్లల ఫొటోలను తల్లిదండ్రుల వివరాల కోసం సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశారు. తండ్రి సమాచారం తెలుసుకొని శ్రీకాళహస్తికి రావడంతో అతడికి పిల్లలను అప్పగించారు.



# న్యూ ఇయర్ సందడి.. ఆకట్టుకున్న వెరైటీ కేక్‌లు







శ్రీకాళహస్తిలో ఆకట్టుకుంటున్న కేక్‌లు, రేణిగుంటలో ఒక బేకరిలో కొనుగోలు దారుల సందడి

శ్రీకాళహస్తి/ రేణిగుంట, డిసెంబరు 31: నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తిలో పలు రకాల వెరైటీ కేకులు అందరినీ ఆకర్షించాయి. బేకరీల్లో ఎక్కడ చూసినా సందడి నెలకొంది. ప్రత్యేకించి వెరైటీకేక్‌ల కోసం ప్రజలు ఆసక్తి చూపారు. వారికి నచ్చిన సైజ్, డిజైన్‌లో ఆర్డర్ చేసి మరీ కొనుగోలు చేశారు. వెరైటీ కేకుల్లో ప్రధానంగా హార్ట్‌షేప్, బటర్‌ఫ్లై, స్టెప్, డాల్ కేక్, డిజైన్ డాల్ కేక్, చెర్రీ కేక్, మిక్కీ మౌస్, బీర్‌బాటిల్ షేప్, పీకాక్, పనసపండు, స్మైల్, చెట్టు, బొకే, గిటార్, చేప తదితర ఆకృతుల్లో కేక్‌లు ఆర్డర్ చేశారు. అలాగే ఫ్లేవర్‌లో వెన్నెలా, చాక్లెట్, హనీ, స్ట్రాబెరీ, బాదం, క్రీమ్, జామ్‌పై మక్కువ చూపారు. 1 కేజీ నుంచి 25 కేజీల వరకు సైజ్‌లో కేక్‌లు అమ్ముడయ్యాయి. ● రేణిగుంట బజారులోని బేకరీలు, వస్త్రదుకాణాల్లో సందడి నెలకొంది. నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి రాత్రి12 గంటలకు కేక్‌కట్ చేయడానికి కేక్‌ల కోసం బేకరీలకు తరలివచ్చారు.

## శ్రీవారిపాదాల చెంత..
## పీఎస్‌ఎల్వీ సీ58 నమూనాకు ప్రత్యేక పూజలు

తిరుమల, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పీఎస్‌ఎల్వీ సీ58 నమూనాకు తిరుమల శ్రీవారి పాదాల చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ప్రయోగానికి ముందు నమూనాను తిరుమలకు తీసుకువచ్చి శ్రీవారి పాదాల వద్ద పూజలు నిర్వహించడం ఇస్రోకు ఆనవాయితీ. ఇందులో భాగంగా షార్ నుంచి సోమవారం ఉదయం 9.10 గంటలకు పీఎస్‌ఎల్వీ సీ58 నింగిలోకి ఎగరనున్న నేపథ్యంలో ఇస్రో డైరెక్టర్లు డాక్టర్ అమిత్‌కుమార్ పాత్ర, డాక్టర్ విక్టర్ జోసస్, ప్రిన్సిపల్ సెక్రటరీ యశోద, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌గుప్తా నమూనాతో ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వారు నమూనాను శ్రీవారి పాదాల వద్ద ఉంచి


ఆలయం ముందు నమూనాతో ఇస్రో అధికారులు

ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సూళ్లూరు పేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఆదివారం ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్. సోమనాథ్ దర్శించుకున్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌తో కలిసి ఆయన విచ్చేసి పీఎస్‌ఎల్వీ-సీ 58 రాకెట్ విజయవంతం కావాలని పూజలు చేశారు.

# నేడు ప్రముఖ ఆలయాలకు ఆర్టీసీ సర్వీసులు

తిరుపతి(కొర్లగుంట), డిసెంబరు 31 : ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని సోమవారం జిల్లాలోని ప్రముఖ ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. కాణిపాకం, శ్రీకాళహస్తి, తలకోన, గుడిమల్లం, నాగలాపురం, బుగ్గఅగ్రహారం, అప్పలాయగుంట వంటి ఆలయాలకు ఉదయం నుంచి 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సర్వీసులు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. పుత్తూరు బస్టాండు నుంచి నాగలాపురం, బుగ్గఅగ్రహారం, తిరుపతి సెంట్రల్ బస్టేషన్ నుంచి శ్రీకాళహస్తి, కాణిపాకం, గుడిమల్లం, అప్పలాయగుంటకు బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సాధారణ చార్జీలే వసూలు చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏటీఎం రామచంద్రనాయుడు కోరారు.

## కరాటేలో దీపిక ప్రతిభ

- జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన ఆర్టీసీ డ్రైవర్ కుమార్తె


దీపికకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

తిరుపతి(కొర్లగుంట), డిసెంబరు 31 : జాతీయ స్థాయి కరాటే పోటీలలో నగరానికి చెందిన దీపిక ప్రతిభచాటి బంగారు పతకం కైవసం చేసుకుంది. సత్యవేడు డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న పి.ఎం.గోపి కుమార్తె పి.దీపిక నగరంలోని టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ హైస్కూల్లో 6వ తరగతి చదువుతోంది. విద్యతో పాటు కరాటేలోనూ శిక్షణ తీసుకుంది. గతనెల 16న విశాఖపట్నంలో నిర్వహించిన కేలో ఇండియా ఉమెన్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్ అండర్-12 కరాటే పోటీలలో విజేతగా నిలిచింది. బంగారు పతకంతో పాటు సర్టిఫికెట్స్ స్వీకరించింది. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్‌యాదవ్ ఆదివారం ఆ బాలికను సన్మానించి, చిత్రపటాన్ని బహూకరించారు.

## ముగిసిన రాష్ట్రస్థాయి రోల్‌బాల్ స్కూల్ గేమ్స్

తిరుపతి (కొర్లగుంట), డిసెంబరు 31 : శ్రీనివాస క్రీడా సముదాయ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి రోల్‌బాల్ స్కూల్‌గేమ్స్ ఆదివారం ముగిశాయి. జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ విజయకుమారి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో విజేతలకు కప్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా రోల్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.ప్రతాప్, జాయింట్ సెక్రటరీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

●అండర్-17 బాలుర విభాగంలో విశాఖపట్నం (ప్రథమ), ఉమ్మడి చిత్తూరు జిల్లా (ద్వితీయ), గుంటూరు జిల్లా (తృతీయ).

●అండర్-14 బాలుర విభాగంలో కృష్ణా జిల్లా(ప్రథమ), అనంతపురం (ద్వితీయ), ఉమ్మడి చిత్తూరు జిల్లా(తృతీయ).

●అండర్-17, 14బాలికల విభాగాలలో కృష్ణా (ప్రథమ), ఉమ్మడి చిత్తూరు (ద్వితీయ), గుంటూరు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి.




అండర్ 14 బాలుర జట్టు, బాలికల జట్టు

# పుంగనూరులో ఇరువర్గాల ఘర్షణ

## రెండు వర్గాలపైనా కేసుల నమోదు




దళితులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ జాగరణ సమితి - పోలీసులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ప్రేమ్‌కుమార్

పుంగనూరు, డిసెంబరు 31: పుంగనూరులో ఇరువర్గాల మధ్య శనివారం రాత్రి ఘర్షణ జరిగింది. తమపై దాడి చేసి, దుర్భాషలాడి, గుడిలోకి చెప్పులతో వచ్చారని దళితులు చెబుతుండగా.. తమ జెండా, తోరణాలు తొలగించారని ముస్లింలు ఆరోపిస్తున్నారు. దీంతో ఇరువర్గాలపైనా పోలీసులు కేసులు నమోదు చేశారు. పుంగనూరు ఏటిగడ్డపాళ్యం దళితులు ఎం.శాంతమ్మ, అంజమ్మ, జ్యోతిష్‌కుమార్, ఈశ్వర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు వివరాలిలా ఉన్నాయి. ఏటిగడ్డపాళ్యం దళితవాడలో 2020లో ధనకొండ గంగమ్మ ఆలయాన్ని నిర్మించుకున్నారు. సమీపంలోని మొగసాలలో గతంలోనే ముస్లింలు టిప్పుసుల్తాన్ జెండాతోపాటు తోరణాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఓ దళిత యువకుడి జన్మదిన వేడుకల్లో బాణసంచా పేల్చడం వల్ల ముస్లింలు కట్టిన తోరణాలపై నిప్పు రవ్వలు పడటంతో.. వాటిని తీసి పక్కన పెట్టారు. దీన్ని ఓ వ్యక్తి వీడియో తీసి దళితులు తమ తోరణాలు, జెండాలు తొలగించారని సామాజిక మాధ్యమంలో పోస్టు చేశాడు. శనివారం రాత్రి ఒక్కసారిగా 150మంది ముస్లింలు ఏటిగడ్డపాళ్యం వచ్చారు. దళితుల ఇళ్లలోకి చొరబడి కర్రలు, రాడ్లు, రాళ్లతో దాడి చేసి కులం పేరుతో దూషించి భయభ్రాంతులకు గురిచేశారు. దళిత యువకులు చాలామంది గాయపడ్డారు. భయపడిన ఇంకొందరు గంగమ్మ ఆలయంలోకి వెళ్లారు. దాంతో ఇటుకరాళ్లు, రాళ్లు, చెప్పులు, కర్రలు ఆలయంలోకి విసిరారు. ఈ దాడిలో జ్యోతిష్‌కుమార్‌కు తీవ్రగాయాలవడంతో ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకున్నాడు. విషయం తెలియగానే శనివారం రాత్రే పుంగనూరు సీఐ రాఘవరెడ్డి.. సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ సందర్భంగా తమను కులం పేరుతో దూషించి, ఇళ్లలోకి చొరబడి దాడులు చేయడమే కాకుండా ఆలయంలోకి చెప్పులతో రావడం సరి కాదని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని దళితులు కోరడంతో ఆదివారం విచారణ చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### న్యాయం చేయాలంటూ ర్యాలీ

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ముస్లింలు ప్రవర్తించడం, దళితులపై దాడి చేయడం అమానుషమని హిందూ జాగరణ సమితి, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, దళిత సంఘ నాయకులు ఆరోపించారు. ఆదివారం ఏటిగడ్డపాళ్యం దళితులతో కలిసి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ప్రేమకుమార్, హిందూజాగరణ సమితి ప్రతినిధి త్రిమూర్తిరెడ్డి తదితరులు మాట్లాడుతూ ఆలయంపై రాళ్లు, చెప్పులు, కర్రలు విసరడం, దళితులపై దాడులు చేసిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలు సంఘాల నాయకులు పరమేశ్, శివకుమార్, భాస్కర్, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

### ఇరువర్గాలతో చర్చించిన డీఎస్పీ

ఆదివారం రాత్రి పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఇరువర్గాలతో ఈఘటనపై చర్చించారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్.అశోక్ మాట్లాడుతూ దళితులపై దాడులు చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. బాధితులూ అలాగే విన్నవించారు. ఇక మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, వైసీపీ నాయకులు అమ్ము, షరీఫ్ తదితర నాయకులు ఇరువర్గాలతో మాట్లాడి తప్పుచేసిన వారిని దండించి కేసులు లేకుండా రాజీ చేయాలని డీఎస్పీని కోరారు. అయితే దళితులు కేసు కావాలని పట్టుబట్టడంతో పోలీసులు ఇరువర్గాలపైనా కేసులు నమోదు చేశారు.

**కేసులిలా.. :** ఏటిగడ్డపాళ్యంకు చెందిన ఈశ్వర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదుతో ముజాహిత్ మరో ఎనిమిదిమందితోపాటు ఇతరులపై ఓ కేసు నమోదైంది. వసీం ఇచ్చిన ఫిర్యాదుతో ఈశ్వర్‌బాబుతోపాటు మరో ముగ్గురిపై, ముజాహిత్ ఫిర్యాదుతో ఈశ్వర్‌బాబుపై మరో కేసు నమోదైంది. అంటే దళితులపై రెండు, ముస్లింలపై ఓ కేసు నమోదు చేశారు. అన్నీ బెయిల్‌బుల్ కేసులని పోలీసులు తెలియజేశారు.

## తెలంగాణ గవర్నర్‌కు ఘనస్వాగతం

రేణిగుంట, డిసెంబరు31: తెలంగాణా గవర్నర్ తమిళసై సౌందర్‌రాజన్‌కు ఆదివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా తిరుమల పర్యటన కోసం ఆమె హైదరాబాదు నుంచి రేణిగుంట విమానాశ్రయానికి రాత్రి 8.45 గంటలకు చేరుకున్నారు. ఆమెకు డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు, డీటీ భానుప్రకాష్, పోలీసు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

## పెదనాన్నపై కత్తితో దాడి

ఏర్పేడు, డిసెంబరు 31: ఆస్తితగాదాలతో ఓ యువకుడు పెదనాన్నపై కత్తితో దాడిచేశాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సరస్వతికండ్రిగకు చెందిన పెద్దమునిరెడ్డి, చిన్న మునిరెడ్డి అన్నదమ్ములు. వీరికి ఆస్తి తగాదా ఉంది. ఈ క్రమంలో నెలకొన్న వివాదం కారణంగా పెద్దమునిరెడ్డిపై చిన్నమునిరెడ్డి కుమారుడు సురేంద్ర కత్తితో నరికాడు. పెద్ద మునిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం లేదు.

## పోలీసుల అదుపులో దోపిడీ దుండగులు

ఏర్పేడు, డిసెంబరు 31: పాపానాయుడుపేటలో శనివారం రాత్రి బంగారు నగల దుకాణంలో దోపిడీకి యత్నించిన ఘటనలో నిందితులను ఏర్పేడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దుండగుల్లో ఇద్దరు పరారీలో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పట్టుబడిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి


బాలకృష్ణనాయుడు (ఫైల్‌ఫొటో)

వరదయ్యపాళెం, డిసెంబరు 31: రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు మృతిచెందాడు. ఈ ఘటన వరదయ్యపాళెం మండలంలో చోటు చేసుకుంది. తొండంబట్టు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వంకాయలపాటి బాలకృష్ణ నాయుడు (35) శనివారం తెల్లవారుజామున శ్రీకాళహస్తి నుంచి వరదయ్యపాళెం ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా నెలవాయి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. కిందపడి గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నై జీహెచ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ ఆదివారం మరణించాడు. ఆదివారం సాయంత్రం స్వగ్రామంలో దహనక్రియలు నిర్వహించారు. కాగా బాలకృష్ణ నాయుడు అవివాహితుడు. అతడి మృతితో ఆయన తల్లి ఒంటరి అయింది. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హెలెన్ అక్కడికి చేరుకుని నివాళులు అర్పించారు. ఆమెవెంట గోవింద్ చౌదరి, మల్లికార్జున నాయుడు, భాస్కర్‌నాయుడు, కుమార్ తదితరులు ఉన్నారు.

## ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

కేవీబీపురం, డిసెంబరు31: కేవీబీపురంలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షుడు మునిశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు.